



# కరపత్రం

SINCE 2014

సోమవారం ఫిబ్రవరి 9, 2026 | సంపుటి : 2 | సంచిక : 124 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



### సింగరేణి కార్మికులకు నష్టం కలిగించే

# ఏ నిర్ణయమూ తీసుకోం

- సింగరేణి పేరుతో విషప్రచారం తట్టుకోం: రేవంత్‌రెడ్డి
- కార్మికులకు నష్టం చేస్తే ఊరుకోం: సీఎం హెచ్చరిక
- బీఆర్ఎస్ అంటే బ్లాక్‌మెయిల్ రాజకీయ సమితి: సీఎం
- కేసీఆర్--కేటీఆర్‌ను కాపాడుతోంది ఎవరు?: రేవంత్‌రెడ్డి

**గణపురం:**
సింగరేణి కార్మికులకు నష్టం కలిగించే ఏ నిర్ణయమూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకోదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కొందరు ప్రభుత్వంపై విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్నారని, మెడికల్ బోర్డు విషయంలో విషం చిమ్మితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సింగరేణి కార్మికుల వల్లే ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉందన్నారు.

పుర ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. రేగొండ మండలం కొడవటంచ చేరుకున్న సీఎం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి, పక్కనే ఉన్న బాలాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రూ.12.15 కోట్లతో చేపడుతున్న ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ పనుల్లో భాగంగా నిర్మించిన వసతి గృహ భవనాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం గణపురం మండలం చెల్పూర్ పరిధిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. “ఉమ్మడి వరంగల్ జిల్లాకు గొప్ప చరిత్ర ఉంది. దేశానికే నాయకత్వం వహించిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఈ ప్రాంతం నుంచే ప్రాతినిధ్యం వహించారు. తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాది కీలకపాత్ర. సింగరేణి కార్మికుల ప్రత్యేకతను ఉద్యమంలో చూశాం. భూపాలపల్లి జిల్లాను



కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. జిల్లాలను రద్దు చేసే ఆలోచన మాకు లేదు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణ చేయాలంటే ప్రజలతో చర్చించే చేస్తాం. భూపాలపల్లి జిల్లా ఎక్కడికీ పోదు.. కొనసాగుతుంది.

**కేసీఆర్, కేటీఆర్‌ను కాపాడుతున్నది కిషన్‌రెడ్డి కాదా?**

2004-14 మధ్య 20లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇచ్చాం. గత పదేళ్లలో ఎవరికైనా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు వచ్చిందా? కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవితకు మాత్రం ఫామ్‌హౌస్‌లు వచ్చాయి. కేసీఆర్‌కు పేదల పట్ల ఎలాంటి పట్టింపు లేదు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఉన్న ఊరిలో ఓట్లన్నీ బీఆర్ఎస్‌కు.. ఇందిరమ్మ ఇళ్లు ఉన్న ఊరిలో ఓట్లన్నీ కాంగ్రెస్‌కు అని ఆనాడు చెప్పా. అందుకే ప్రజలు కాంగ్రెస్‌కు గంపగుత్తగా ఓట్లు వేశారు. ఏప్రిల్ తర్వాత ఇందిరమ్మ ఇళ్లు రెండో విడత ఇస్తాం. దక్షిణ కుంభమేళాగా సమ్మక్క.. సారలమ్మ జాతర నిర్వహించుకొన్నాం. బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న దేవాలయాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తాం. అటవీ ప్రాంతంలో రిసార్ట్‌లను అభివృద్ధి చేస్తాం.బీఆర్ఎస్ నేతలు ఫోన్ ట్యాపింగ్ ద్వారా వ్యాపారులను బెదిరించి ఎలక్ట్రోరల్ బాండ్ల రూపంలో రూ.1500 కోట్లు తీసుకున్నారు. బీఆర్ఎస్ అంటే బ్లాక్ మెయిల్ రాజకీయ సమితి. పాపాల ఊబిలో ఆ పార్టీ కూరుకుపోతుంది. కిషన్‌రెడ్డి.. కల్వకుంట్ల కిషన్‌రావుగా మారి కేసీఆర్, కేటీఆర్ అరెస్టును ఆపుతున్నారు. ‘నేను ముఖ్యమంత్రినా కేసీఆర్‌ను అరెస్టు చేయడానికి’ అని కిషన్‌రెడ్డి చెబుతున్నారు. సర్వం త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని సీబీఐ, ఈడీ కేసులతో అవమానిస్తున్నారు. కాళేశ్వరంలో అవినీతి చేసిన కేసీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడంలేదు. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్‌ను కాపాడుతున్నది మీరు కాదా?” అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీని ఓడించేందుకు రూ.100 కోట్ల డీల్

### - కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్: కరీంనగర్ లో కాంగ్రెస్, ఎంఐఎం వర్సెస్ బీజేపీ మధ్య ఆట స్టార్ట్ అయ్యిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇండియా పాకిస్తాన్‌ను చిత్తు చేసినట్లుగా కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలకు బుద్ధి చెప్పండని పిలుపునిచ్చారు. ఆదివారం (ఫిబ్రవరి 8) కరీంనగర్‌లో ఆయన మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్, ఎంఐఎం రహస్య సమావేశం పెట్టుకుందని.. బీజేపీ 50 సీట్లలో గెలవబోతోందని






తెలిసి రూ.100 కోట్లతో ఓట్లను కొనేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. పెద్ద ఎత్తున ఓట్లను కొని గెలవాలని కుట్ర చేస్తున్నయన్నారు. బీజేపీకి ఇల్లు, కుటుంబం ముఖ్యం కాదని.. దేశం, ధర్మమే ముఖ్యమని పేర్కొన్నారు. బీజేపీని గెలిపిస్తే కరీంనగర్ కు రక్షణ కవచంగా మారుతానన్నారు. బీజేపీ ఓడిపోతే కరీంనగర్ సర్వనాశనమయ్యే ప్రమాదముందని అన్నారు. ఒక్కొక్కరు ఒక్కో బస్తీని దత్తత తీసుకుని గంప గుత్త ఓట్లను బీజేపీకి వేయించండని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## దోచుకున్న సొమ్ముకోసం కేసీఆర్ కుటుంబంలో గొడవలు

- » దోపిడీ సొమ్మే కుటుంబ చిచ్చు: సీతక్క
- » కేసీఆర్ కుటుంబంలో ఆస్తి యుద్ధం: మంత్రి ఆరోపణ
- » దోచుకున్నదానికే గొడవలు: సీతక్క ఫైర్
- » బీఆర్ఎస్, బీజేపీలకు ఓటేస్తే మురిగిపోతారు: సీతక్క



యాదాద్రి భువనగిరి
పదేండ్లుపాలించి దోచుకున్న సొమ్ముకోసం కేసీఆర్‌కుటుంబంలో అన్నాచెల్లి బంధాలను మర్చి ఆస్తుకోసం గొడవలు పడుతున్నారని మంత్రి సీతక్క విమర్శించారు. కేసీఆర్ పాలనలో మున్సిపాలిటీలకు మంచినీళ్లు కూడా ఇవ్వలేదన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే మున్సిపాలిటీలను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు మంత్రి సీతక్క.బీఆర్ ఎస్ పాలనలో చేసిన అప్పులతో రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ.. సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం..బీఆర్ఎస్, బీజేపీలకు ఓట్లు వేస్తే మురిగిపోయినట్లే.. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మున్సిపాలిటీలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు సీతక్క.భువనగిరి మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మంత్రి సీతక్క కార్నర్ మీటింగ్ లో పాల్గొన్నారు. ఈ ప్రచారంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డిలు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కాంగ్రెస్, బీఆర్ఎస్..

# రెండు పార్టీలు ఒక్కటే

- » ఒకరు దొంగ.. మరొకరు దోపిడీ దొంగ: రామచంద్రరావు
- » కాంగ్రెస్‌కీ బీఆర్ఎస్‌కీ తేడా లేదు: భాజపా నేత
- » రెండు పార్టీల పాలన ఒకే బాట: రామచంద్రరావు
- » ఓటర్లను మోసం చేస్తున్న రెండు పార్టీలు: భాజపా ఆరోపణ

**నల్గొండ:**
రాష్ట్రంలో కాంగ్రెస్‌కి ఓటేసినా.. బీఆర్ఎస్‌కు వేసినా ఒక్కటేనని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఎద్దేవా చేశారు. ఒకరు దొంగ అయితే.. మరొకరు దోపిడీ దొంగ అని ఆరోపించారు. బీఆర్ఎస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలు ఇప్పుడు ఎక్కడున్నారని ప్రశ్నించారు. అదే భాజపా నేతలు ఓడినా.. గెలిచినా ఒకే పార్టీలో ఉంటారని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పులనే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు.



2లో..

### ‘మంత్రి పదవి ఇచ్చారు..

## ఎమ్మెల్సీ పదవి మాత్రం లేదు’

**హైదరాబాద్ :**
సుమారు మూడు నెలల క్రితం, అంటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలో మహ్మద్ అజారుద్దీన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మంత్రి పదవిపై బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్‌రావు విమర్శల వర్షం కురిపించారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడం బాగానే ఉన్నా, ఇంకా ఎమ్మెల్సీ పదవి ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ‘అజారుద్దీన్‌కు మంత్రి పదవి వచ్చి 3 నెలలైంది. ఇంకా ఎమ్మెల్సీ పదవి ఇవ్వలేదు. ఇంకో మూడు నెలల్లో ఎమ్మెల్సీ కాకపోతే మంత్రి పదవి పోతుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మేం ప్రశ్నినందుకే.. అజారుద్దీన్‌కు మంత్రి పదవి దక్కింది’ అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు హరీష్‌రావు. అజారుద్దీన్ తెలంగాణ ప్రభుత్వంలో పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు. ఈ పదవిని ఆయన 31 అక్టోబర్ 2025న స్వీకరించారు. అదేవిధంగా, ఆయన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కూడా కొనసాగుతున్నారు . అయితే ఎమ్మెల్సీగా లేరు. అంటే, ప్రస్తుతం ఆయనకు ఉన్న పదవి రాష్ట్ర మంత్రిగా ఉన్నారు కానీ ఎమ్మెల్సీగా లేరు. రాష్ట్ర మంత్రిగా ఉండాలంటే అటు ఎమ్మెల్యేగా కానీ, ఎమ్మెల్సీ కానీ ఉండాలి. ఇదే విషయాన్ని ప్రశ్నించారు హరీష్‌రావు.




## ‘ఒక తప్పు ఓటు వేసినందుకు రెండేళ్లుగా గోస పడుతున్నాం’

**వరంగల్ :**
కాంగ్రెస్‌పై మరోసారి ధ్వజమెత్తారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. కాంగ్రెస్ పార్టీ అంటేనే ఆడవాళ్ల మెడలో పుస్తెల తాడు దొంగతనం చేసే దండుపాళ్యం బ్యాచ్ అంటూ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఒక తప్పు ఓటు వేసినందుకు రెండేళ్లుగా గోస పడుతున్నామని మరొకసారి ఆ తప్పు చేయొద్దన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేట మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కేటీఆర్ ప్రసంగించారు. ‘మున్సిపల్ ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయండి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్ని దొంగ హామీలే. కాంగ్రెస్ పార్టీ అంటేనే ఆడవాళ్ల మెడలో పుస్తెల తాడు దొంగతనం



చేసే దండుపాళ్యం బ్యాచ్. 11వ తేదీన జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పాలి’ అని ప్రజల్ని కోరారు.



మిగతావి 2లో




## హైదరాబాద్లో వీకెండ్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు..

### రెండు రోజుల్లో 604మందిపై కేసులు

- వీకెండ్ డ్రంక్ డ్రైవ్ తనిఖీలు: 604 కేసులు
- తాగి బండి నడిపితే కఠిన చర్యలు: రెండు రోజుల్లో 604 మంది పట్టుబాటు
- డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ట్రాఫిక్ పోలీసుల ఉక్కుపాదం
- నగరంలో వీకెండ్ తనిఖీలు.. వందల కేసులు నమోదు

## ‘పర్యావరణ నిర్లక్ష్యం జాతి మనుగడకు అత్యంత ప్రమాదకరం’

పర్యావరణాన్ని మనం ఎంతగా నిర్లక్ష్యం చేస్తే దాని పర్యవసానాలు మానవ జాతి మనుగడకు అంత ప్రమాదకరంగా పరిణమిస్తాయని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. పాత వ్యవసాయ పద్ధతులను పరిరక్షించుకోవడం వల్ల భూసారం, మనుషుల ఆరోగ్య ప్రయోజనాలే కాకుండా పర్యావరణ పరిరక్షణ కూడా సాధ్యమవుతుందని, ఆ దిశగా ప్రజలు చైతన్యం పెంచుకోవాలని కోరారు.పశు సంపదను పెంచు కోలేకపోతే వచ్చే 5 ఏళ్లలో మన భూమి, మన వ్యవసాయం మనకు కాకుండా పోతాయని ఆయన హెచ్చరించారు.



# హైదరాబాద్లో వీకెండ్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు..

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ సిటీలో డ్రంక్ అండ్ డ్రైవ్ పై ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. జీరో టాలరెన్స్ విధానంలో తాగి బండి నడిపినవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. వీకెండ్స్‌లో నగరవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు చేస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వాహనదారులపై కేసులు నమోదు చేస్తున్నారు. గడిచిన రెండు రోజుల్లో హైదరాబాద్‌నగర వ్యాప్తంగా నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 604మంది వాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవీస్ తెలిపారు.

రెండు రోజులుగా నగరవ్యాప్తంగా జరిపిన తనిఖీల్లో 604 మంది వాహనదారులపై కేసు నమోదు చేశారు. పట్టుబడిన వారిలో బైకర్స్ ఎక్కువగా ఉన్నారు. 492 మంది బైకిస్టులు, 42 మంది ఆటో డ్రైవర్లు, 70 మంది ఫోర్ వీలర్స్ ఇతర వాహన దారులపై కేసులు నమోదు చేశారు. వీరంతా అధికమొత్తంలో మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు పోలీసులు చెప్పారు.

ఈ తనిఖీల్లో పట్టుబడిన వాహనదారుల్లో రక్తంలో ఆల్కహాల్ మోతాదుకు మించి ఉన్నట్లు తేలింది. అనుమతించిన పరిమితి 30 మైక్రోగ్రాములు మాత్రమే కాగా.. అంతకు నాలుగైదు రెట్లు ఉన్నట్లు గుర్తించారు. డ్రంక్ డ్రైవింగ్‌పై జీరో టాలరెన్స్ విధానం అమలు చేస్తున్నామని ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయెల్ డేవిస్ స్పష్టం చేశారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదాలకు కారణమైతే భారతీయ న్యాయ సంహిత --2023లోని సెక్షన్ 105 కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉందన్నారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్.. రెండు పార్టీలు ఒక్కటే

మొదటి పేజీ తరువాయి

నల్గొండ క్లాక్ టవర్ సెంటర్లో ఏర్పాటు చేసిన కార్పొరేషన్ ఎన్నికల విజయ సంకల్ప సభలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం దారి మళ్లిస్తోందని విమర్శించారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో భాజపా జెండా ఎగరబోతోందని జోస్యం చెప్పారు. నల్గొండలో ఇప్పటికీ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేదన్నారు. భాజపాను గెలిపిస్తే నల్గొండను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు అవకాశాలు ఇచ్చారు.. ఒక్కసారి భాజపాకు అవకాశం ఇవ్వాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. భాజపాకు అవకాశం ఇస్తే తెలంగాణను అవినీతి లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు.

## ‘పర్యావరణ నిర్లక్ష్యం జాతి మనుగడకు అత్యంత ప్రమాదకరం’

మొదటి పేజీ తరువాయి

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మండలం అన్నారుపల్లిలోని ఎర్త్ సెంటర్ లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ సంయుక్తాధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన తెలంగాణ ద్వితీయ వార్షిక విత్తన పండుగ ముగింపు సమావేశం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆర్టీఐ మాజీ కమిషనర్ దిలీప్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ ముగింపు సమావేశంలో జాతీయ జీవవైవిధ్య ప్రాధికార సంస్థ మాజీ అధ్యక్షుడు అచలేందర్ రెడ్డి తదితర ముఖ్యులు పాల్గొన్నారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... దేశీ విత్తనాల గ్రేడింగ్ తో ప్రకృతి వ్యవసాయం లో కూడా అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి మాట్లాడుతూ... దేశీ విత్తనాలు దేశ సంపద అని, వాటి విస్తృత వినియోగానికి ప్రోత్సాహం ఇచ్చే రీతిలో ప్రణాళికా బద్ధమైన ప్రభుత్వ విధానాలు అవసరం అన్నారు. రైతు ప్రయోజనాలు, ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ఈ విధానాలు రూపొందాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు తగిన ప్రాధాన్యత ఇస్తేనే ప్రకృతి వ్యవసాయ పద్ధతు ల వినియోగం పెరుగుతుందన్నారు.

ప్రభుత్వ విధానాలలో మార్పు వచ్చినప్పుడే ప్రకృతి వ్యవసాయం సాధ్యమవుతుందని ఏపీ మాస్ వ్యవస్థాపకులు సీఎస్ రెడ్డి ఆన్నారు. రైతు ఉత్పత్తి దారుల సంఘాలకు ఈ ఉద్యమం లో కీలక పాత్ర ఉందన్నారు. దేశీ విత్తనాల తో పంట దిగుబడి తగ్గుతుందనేది కేవలం ఒక అపోహేనని , వాటి వినియోగం వల్ల భూమి, మనుషుల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయానికి అనుగుణమైన ప్రత్యామ్నాయ విత్తన వ్యవస్థ ను బలోపేతం చేయాలన్నారు.

ప్రముఖ పర్యావరణ వేత్త దొంతి నర్సింహా రెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుతం దేశంలో హైబ్రిడ్, దేశీ విత్తన వ్యవస్థల మధ్య సంఘర్షణ జరుగుతుందన్నారు. అనేక రాష్ట్రాల్లో కార్పొరేట్ ప్రయోజనాలతో కూడిన విత్తన వ్యవస్థను రైతులు సవాలు చేస్తూ ప్రకృతి వ్యవసాయ ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ప్రెసిడెంట్ లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రైతులు, శాస్త్రవేత్తలు, విధాన నిర్ణేతలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయ భాగస్వామ్యం తో విత్తన పండుగను విజయవంతంగా నిర్వహించామన్నారు. లక్ష్యం దిశగా ప్రయాణించాల్సిన దూరం ఇంకా చాలా ఉందని, మరింత స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక తో ముందుకు సాగుతామని ఆమె చెప్పారు

## నిరుద్యోగులకు నకిలీ డీఎస్పీ టోకరా ఉద్యోగాల పేరుతో లక్షల్లో వసూళ్లు

### –అరెస్ట్ చేసి విచారిస్తున్న పోలీసులు

పోలీస్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి అమాయకుల నుంచి లక్షలు కొట్టేశాడో దుర్మార్గుడు. చెల్లుబోయిన లోచన కుమార్ అనే వ్యక్తి నకిలీ డీఎస్పీ వేషంలో లక్షల రూపాయల వసూళ్లకు పాల్పడ్డాడు. ఈ వ్యవహారం ప్రస్తుతం.. విశాఖ నగరంలో సంచలనం సృష్టిస్తోంది. 2019 నుంచి 2026 వరకు తాను డీఎస్పీ, ఎస్పీ అని చెబుతూ పలు మోసాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై విశాఖ పోలీసులు సీరియస్‌గా దర్యాప్తు చేపట్టారు. నెల్లూరు డీటీసీ(డిస్టిక్ ట్రైనింగ్ సెంటర్)లో గెస్ట్ ఫ్యాకల్టీగా వెళ్లిన నకిలీ డీఎస్పీ.. పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. నెల్లూరులో దొరికిన నకిలీ డీఎస్పీని విశాఖపట్నానికి తీసుకువచ్చారు పోలీసులు. గ్రూప్ 1 పరీక్షల్లో సత్తా చాటినట్లు లోచన కుమార్ పలు పత్రికల్లో ఫేక్ ప్రచారాలు చేశాడు. అతడిపై విశాఖ సిటీ పరిధిలోని ఎయిర్‌పోర్ట్ పీఎస్‌లో రెండు కేసులు, ఎంవీపీ పీఎస్, మల్కాపురం పీఎస్, ఫోర్త్ టౌన్ పీఎస్‌లలో చీటింగ్, ఎక్స్‌టార్షన్, జాబ్ ఫ్రాడ్ వంటి కేసులపై ఎఫ్ఐఆర్ నమోదయ్యాయి. సివిక్ సెంటర్ ఐఏఎస్ అకాడమీలో శిక్షణ తీసుకున్నట్లు సోషల్ మీడియాలో బిల్డప్ ప్రచారాలకు దిగాడు. లోచన కుమార్ మోసాలపై విశాఖపట్నం పోలీసులు విచారణ చేపట్టారు. నకిలీ డీఎస్పీ లోచన కుమార్ మోసాలపై విశాఖపట్నం నగర పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇతనికి సహకరించిన వ్యక్తులు ఇంక ఎవరైనా ఉన్నారా, నగదు లావాదేవీలు ఎవరెవరి ఖాతాల్లోకి వెళ్లాయా అని ఆరా తీస్తున్నారు. ఇతర జిల్లాల్లోనూ ఇలాంటి కేసులు ఏమైనా ఉన్నాయా అనే కోణాల్లో పోలీసుల దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ కేసు నేపథ్యంలో పోలీసులు అభ్యర్థులకు ముఖ్య సూచనలు చేస్తున్నారు. పోలీస్, ఇతర ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో ఎవరు డబ్బులు అడిగినా వెంటనే అప్రమత్తంగా ఉండాలని, అధికారిక నోటిఫికేషన్లు, నియామక ప్రక్రియల ద్వారానే ఉద్యోగాలు వస్తాయని పోలీసులు గుర్తు చేశారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి డబ్బులడిగితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

# విపక్షంగా కాంగ్రెస్ వైఫల్యం

దేశంలో రాజకీయ నేతలు బానిస భాజాలంతో బతుకుతున్నారు. అధికారపక్షంపై బట్టకాల్చి మీద పడేస్తే.. తరవాత అధకారం మనదే అన్న ధోరణిలో ఉన్నారు. ఎవరి లక్ష్యమైనా అధికారమే. అధికారంలో ఉన్నవారు దానిని కాపాడుకునే ప్రయత్నం..లేనివారు అధికారంలోకి వచ్చే ప్రయత్నాల్లో విన్యాసాలు చేస్తున్నారు. తాజాగా ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఎవరి పేరుందో వెతికి మరీ విమర్శలకు దిగుతున్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఇందులో ముందున్నారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతన్న వేళ సమస్యలపై పోరాటం ఆపేశారు. ప్రజల పక్షాలన పోరాడలేక చతికిల పడ్డారు. పార్లమెంట్‌కు రావడం గోల చేయడం, వాకౌట్ చేయడం ఇదీ విపక్షాలు అలవాటు చేసున్న నమూనా. అధికార బిజెపి ఏదయితే కోరుకుంటుందో అదే చేస్తున్నారు. మనదేశంలో జరిగిన దారుణ ఘటనలకు సంబంధించి కాశ్మీర్ ఫైల్స్, కేరళ ఫైల్స్‌పై చర్చ అసవరం లేదు. దేశంలో జరుగుతున్న సమస్యలపై చర్చ పట్టదు. ఉపాధిపతకానికి గాంధీ పేరు తొలగించారని ఆందోళన చేస్తారు. ఇది ప్రజలకు కూడాగుడ్డ పెట్టేది కాదు. నిజానికి ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో రాహుల్ ఓ అసమర్థ నేత అని ఉంది. అది నిజమే అన్నట్లుగా గత పదేళ్లుగా రాహుల్ ప్రజల సమస్యలపై ఒక్కటంటే ఒక్క పోరాటం చేయలేదు. పార్లమెంట్‌లో పోరాడడం లేదు. నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకోవడం లేదు. అందుకే కాంగ్రెస్ పార్టీకి ఏమైంది అన్న ఆందోళన కలుగుతోంది. నాయకత్వ సమస్య ఈ పార్టీని పట్టిపీడిస్తున్నది. సుదీర్ఘ కాలం అధికారంలో కొనసాగిన ఆ పార్టీ నాయకత్వం ఇప్పుడు వెలవెలబోవడానికి కారణం కేవలం రాహుల్ అన్నదే గుర్తించాలి. కాంగ్రెస్ పార్టీ జవసత్వాలు పొందడానికి కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు రాహుల్ పాదయాత్ర చేసి ఇప్పుడేమో అచేతనంగా ఉండిపోయారు. పార్టీ జవసత్వాలు కోల్పోవడానికి ఆ పార్టీ నాయకత్వం అనుసరిస్తున్న విధానాలే కారణమని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. నవతరం ఆశిస్తున్నది ఏమిటో గుర్తించి అందుకు అనుగుణంగా పార్టీని తీర్చిదిద్దడంలో, విధానాల రూపకల్పనలో కాంగ్రెస్ నాయకత్వం పూర్తిగా విఫలమవుతోంది. వరుస ఓటములతో పార్టీ భవిష్యత్తు మసకబారిన సమయంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసేందుకు కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ పెద్దగా కార్యాచరణ చూపడం లేదు. మోడీ వైఫల్యాలను ఎండగట్టడానికి పార్లమెంట్ మంచి వేదిక. పార్లమెంటులో వివిధ అంశాలను లేవనెత్తి వాటిపై చర్చించే అవకాశం ఉంటుంది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం కావచ్చు, బడ్జెట్ ప్రసంగం కావచ్చు...వీటిపై చర్చలో ప్రభుత్వ విధానాలను ఏకిపారేయవచ్చు. కానీ దానిని ఉపయోగించు కోవడంలో విపక్షనేతగా రాహుల్ పూర్తిగా విఫలం అయ్యారనే చెప్పాలి. సంబంధం లేని మాజీ ఆర్మీ చీఫ్ నరవాణెళి రాతలను ప్రస్తావిచడం ద్వారా అభాసుపాలయ్యారు. ఎందుకంటే ఆ పుస్తకం ఇంకా అచ్చు కాలేదు. ఇలా వరుస వైఫల్యాలను చూసిన తరవాత కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు ఉంటుందన్న నమ్మకం కలగడం లేదు. 75 ఏళ్లకు చేరువలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పోటీపడటంలో 50 ఏళ్లు పైబడిన రాహుల్‌గాంధీ ఎందుకు వెనుకబడుతున్నారు. ప్రజలు ఏమి కోరుకుంటున్నారన్నది పట్టించుకోవడం లేదు. వారి ఆలోచన ల్లో వచ్చిన మార్పు ఏమిటి అన్నది పసిగట్టలేకపోవడమే కారణంగా కనిపిస్తోంది. ప్రజల ఆలోచనల్లో వస్తున్న మార్పును గుర్తించడానికి నిరాకరిస్తూ తుప్పు పట్టిన భావజాలాన్నే కొనసాగించడం వల్లనే కమ్యూనిస్టు పార్టీలు అంతర్థానం అయ్యాయి. వారు ఇప్పటికీ అది గమనించడం లేదు. అమెరికాతో ఒప్పందాన్ని కూడా వ్యతిరేకించడమంటే అంతకు మించిన దౌర్భాగ్యం మరోటి లేదు. ప్రపంచంలో మనదేశం మనుగడ సాగించాలంటే ఒప్పందాలు తప్పవు. ట్రంప్ బెదరింపుల కారణంగా ఇంతకాలం మోడీ నిశ్శబ్దంగా ఉన్నారు. ఇప్పుడు ఒప్పందానికి ఓకే చెప్పిన తరవాత కాంగ్రెస్, కమ్యూనిస్టులు విమర్శలు చేస్తున్నారు. ఇదే వారి నాయకత్వ లోపానికి, అంతర్జాతీయ అవగాహన లేదనడానకి నిదర్శనంగా చూడాలి. ప్రపంచీకరణ కారణంగా కష్టపడే వారికి ఉపాధి అవకాశాలకు కొదవ లేదు. జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడ్డాయి. ఫలితంగా మనవాళ్లు ఏదేశమైన వెళ్లి పనిచేసుకో గలుగుతున్నారు. రాజకీయ పార్టీలు ప్రపంచ పరిణామాలకు అనుగుణంగా సాగాలి. అవి మన ప్రజలకు ఎలా ఉపయోగమో ఆలోచన చేయాలి. అలా చేయకపోవడం వల్లనే కాంగ్రెస్, కమ్యూనిస్టులు కాలక్రమంలో మెజారిటీ ప్రజలకు దూరమయ్యారు. యువతరానికి పూర్తిగా దూరమయ్యారు. కాంగ్రెస్ పార్టీలో ఆలోచనా పరులు లోపించారు. ఒకరిద్దరు రాహుల్‌ను కంట్రోల్ చేస్తున్నారు. అందుకే ఆయన ఆలోచనలు ఎంతసేపు మోడీని దింపడమెలా అన్న ధోరణిలో సాగుతున్నారు. మోడీని దింపేముందు మోడీ పనులను నిలదీఏ ప్రయత్నాలు చేయడం లేదు. మోడీని దోషజగా నిలబెట్టే యత్నాలు చేయడం లేదు. తొలి తరం కాంగ్రెస్ నాయకత్వం అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ రంగాన్ని ప్రోత్సహించింది. ఆ తర్వాత దశలో ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రైవేటీకరణను ప్రోత్సహించారు. పివి నరసింహారావు సంస్కరణ పుణ్యమా అని ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే పేదల సంక్షేమం చేపట్టవచ్చని నమ్మారు. సుదీర్ఘకాలం అధికారంలో కొనసాగి, మళ్లీ అధికారంలోకి రావాలనుకుంటున్న పార్టీ నాయకుడి చర్యలు కాలానుగుణంగా ఉండడం లేదు. ముత్తాత జవహర్‌లాల్ నెహ్రూ, నాయనమ్మ ఇందిరాగాంధీ, తండ్రి రాజీవ్‌గాంధీ, పివి నరసింహారావు, మన్మోహన్ సింగ్‌లు అనుసరించిన విధానాలను రాహుల్‌గాంధీ అధ్యయనం చేయకపోవడం వల్ల దౌర్భాగ్యంగా చూడాలి. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల మనోభావాలకు అనుగుణంగా వ్యూహ రచన చేస్తూ భారతీయ జనతా పార్టీని విజయపథంలో నిలబెడుతున్నారు. ’75 ఏళ్ల వయసులో కూడా ప్రధాని మోదీ యువతను ఆకర్షించడానికి కారణం ఏమిటన్నది ఆలోచన చేస్తున్నారు. కాంగ్రెస్ తన నాయకత్వ పటిమను బలపర్చుకోకుంటే రాణించడం కలష్టమన్న విషయం రాహుల్ ఎంత తొందరగా గుర్తిస్తే అంతమంచిది.

## అమెరికాతో ఒప్పందం మనకే నష్టం మన రైతులకు తీరని అన్యాయం జరగనుంది

### – ఎక్స్ వేదికగా కాంగ్రెస్ జైరామ్ రమేశ్ విమర్శలు

భారత్ అమెరికాతో చేసుకున్న వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ కేంద్రాన్ని తీవ్రంగా విమర్శించారు. అమెరికా వ్యవసాయోత్పత్తులపై భారత్ దిగుమతి సుంకాల్ని తగ్గించడం వల్ల అమెరికా రైతులకే ప్రయోజనం చేకూరుతుందని ఆయన అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. ’ఇటీవల విడుదల చేసిన అమెరికా– భారత్ సంయుక్త ప్రకటనలో.. ఆ ఒప్పందంకి సంబంధంచిన వివరాలేమీ లేవు. భారత్ ఇకపై రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకోదనే విషయం మాత్రం స్పష్టంగా తెలుస్తుంది. అలాగే రష్యా నుండి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా చమురు కొనుగోలు చేస్తే 25 శాతం జరిమానాను భారత్‌పై తిరిగి విధించ్చని అమెరికా ప్రకటించింది’ అని రమేష్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడిని ఆయన విమర్శించారు. ట్రంప్‌తో మోడీ దిగిన ఫొటోలను ప్రస్తావిస్తూ.. ’ఫొటో ఆప్స్ భారతదేశానికి పెద్దగా ప్రయోజనం చేకూర్చలేదని, దౌత్య వైఫల్యాన్ని సూచిస్తున్నాయని ఆయన అన్నారు. భారతీయ రైతులను పణంగా పెట్టి అమెరికన్ రైతులకు సహాయం చేయడానికి భారతదేశం దిగుమతి సుంకాలను తగ్గిస్తుంది. ఈ ఒప్పందంతో అమెరికా నుండి భారత్ వార్షిక దిగుమతులు మూడురెట్లు పెరుగుతాయి. మన దీర్ఘకాల వస్తువుల వాణిజ్య మిగులు తుడిచిపెట్టుకుపోతుంది. భారత్ నుంచి అమెరికాకు ఐటి, ఇతర సేవల ఎగుమతులపై తీవ్ర అనిశ్చితి కొనసాగుతుంది. అలాగే అమెరికాకు ఎగుమతులు చేసే భారత్ వస్తువులపై గతకంటే ఎక్కువ సుంకాలు విధిస్తారు. దీన్నిబట్టి చూస్తే.. ట్రంప్‌ను చేసుకున్న కౌగిలింతలు, దిగిన ఫోటోలు పెద్దగా ఫలించలేదు. నమస్తే ట్రంప్.. హౌడీ మోడీపై స్కోర్ చేసింది. స్నేహితుడు ఇకపై స్నేహితుడు కాదు అని జైరాం రమేశ్ అన్నారు.

## ముంబై మేయర్ పదవి బిజెపికే

- బిజెపి మేయర్ అభ్యర్థిగా రితూ తావ్డే
- డిప్యూటి మేయర్‌గా శివసేన కార్పొరేటర్ సంజయ్ శంకర్ ఘూడి
- నామినేషన్లు దాఖలు..11న ఎన్నిక

ముంబయి మేయర్ పదవిని బిజెపి దక్కించుకోవడం ఖాయమైంది. ఈ క్రమంలో అధికార మహాయుతి కూటమి అభ్యర్థిని ఖరారు చేసింది. భాజపా కార్పొరేటర్ రితూ తావ్డే ఈ బరిలోకి దిగనున్నట్లు ఆ పార్టీ నేత అమిత్ సతమ్ ప్రకటించారు. పార్టీ అగ్ర నాయకత్వంతో సంప్రదింపులు జరిపిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. స్థానికంగా భాజపా సీనియర్ నేత అయిన రితూ మూడుసార్లు కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ విద్యా కమిటీ అధ్యక్షురాలిగా పనిచేసిన అనుభవం కూడా ఆమెకు ఉంది. ఇక, డిప్యూటీ మేయర్ పదవికి కూటమి అభ్యర్థిగా శివసేన కార్పొరేటర్ సంజయ్ శంకర్ ఘాడిని ఎంపిక చేసినట్లు సతమ్ వెల్లడించారు. రితూ, సంజయ్‌లు శనివారం నామినేషన్లు దాఖలు చేశారు. ఫిబ్రవరి 11న మధ్యాహ్నం ఈ మేయర్ ఎన్నిక జరగనుంది. కాగా.. బృహన్ ముంబయి కార్పొరేషన్ బీఎంసీలో 227 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో అధికార మహాయుతి కూటమి ఘన విజయం సాధించింది. 118 చోట్ల (భాజపా 89, శివసేన 29) గెలుపును కైవసం చేసుకుంది. ఇక, శివసేన (యూబీటీ) 65, దాని మిత్రపక్షాలైన మహారాష్ట్ర నవనిర్మాణ సేన 6, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (శరద్‌పవార్) 1, కాంగ్రెస్ 24, ఏఐఎంఐఎం 8, ఎన్సీపీ (అజిత్ పవార్) 3, సమాజ్ వాద్ పార్టీ 2 స్థానాలను దక్కించుకున్నాయి. అయితే బిజెపి పైచేయి సాధించడంతో ఇప్పుడు మేయర్ కోసం పట్టుపట్టింది.

## ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్ర

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్రలో భాగంగా తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం కోటపోలూరు పంచాయతీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి రచ్చబండ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పేద బడుగు బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుని వచ్చిన మహాత్మా గాంధీ జాతి ఉపాధి హామీ పథకం చట్టాన్ని బిజెపి ప్రభుత్వం నీరుగారుస్తుందని,పేదల కడుపు కొట్టేందుకే పథకం పేరు మార్చి 125 రోజులు పెంచుతున్నట్లు బూటకపు మాటలు చెబుతున్నారని తెలిపారు. 8 గంటల ఉన్న పనిని 12 గంటలు చేశారని, పూర్తిగా కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం,కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు ఇస్తామని చెప్పడం పేద ప్రజలకు ద్రోహం చేసినట్లు కాదా అని మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో రాజశేఖర్ రెడ్డి తీసుకొచ్చిన అనేక సంక్షేమ పథకాలు భారతదేశంలోని అన్ని రాష్ట్రాలు ఆచరణలో పెట్టాయని తెలిపారు.గ్రామాలలో గుడులు, బడులు లేకపోయినా బెల్ట్ షాపులు మాత్రం అధికంగా ఉన్నాయని,రాష్ట్రంలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయని,రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ అనారోగ్యంతో ఉందని తెలిపారు.మళ్లీ మన అందరి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అటు దేశం అభివద్ధి పథంలో దూసుకుపోతుందని వైయస్ షర్మిల తెలియజేశారు.

## ఎన్నాళ్లు కేంద్రాన్ని తిడుతూ పాలిస్తారు కెసిఆర్‌పై చర్యలు తీసుకుంటే అడ్డుకున్నదెవరు

### – రేవంత్ తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి

మాజీ సీఎం కేసీఆర్‌పై చర్యలు తీసుకుంటామంటే.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎవరు అడ్డుకున్నారో చెప్పాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చర్యలు తీసుకోవాల్సింది సీఎం కాదా అని ప్రశ్నించారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రికి చేతగాక.. బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ తమకు అవసరం అని చెప్పుకోవాలి కానీ.. కిషన్ రెడ్డి మీదనో, కేంద్ర ప్రభుత్వం మీదనో నిందలు వేయొద్దని హితవు పలికారు. కిషన్‌రెడ్డిని అడ్డుపెట్టి సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కువ రోజులు తప్పించుకోలేరన్నారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని ఏ ఒక్క రోజైనా రాహుల్‌గాంధీ.. రేవంత్ రెడ్డిని ఆదేశించారా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌పై చర్యలకు రాహుల్ గాంధీ అడ్డుపడకుంటే తక్షణమే చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని అడ్డుకోవడం కోసం సోనియా కుటుంబం, కేసీఆర్ కుటుంబం ఏకమయ్యాయని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. బీఆర్ఎస్, కాంగ్రెస్.. ఎవరు అధికారంలో ఉంటే వారు మజ్లిస్‌ను ప్రసన్నం చేసుకుంటున్నారని ఆరోపించారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు ఈ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తమను విమర్శించే ముందు సీఎం రేవంత్ ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు. రేవంత్ తనను కల్వకుంట్ల కిషన్ రావు అని విమర్శించారని.. తానెలా కల్వకుంట్ల కిషన్ రావు అవుతాను? అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబాన్ని కాపాడాల్సిన అవసరం తనకు ఎందుకుంటుందని నిలదీశారు. పనికిరాని, పసలేని ఆరోపణలు చేయడం రేవంత్ రెడ్డికి బాగా అలవాటైందని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. రేవంత్ చెత్త విమర్శలకు తాను చాలాసార్లు కౌంటరిచ్చానని అన్నారు. మళ్లీ మళ్లీ ఆయన పిచ్చి ప్రేలాపనలు చేయొద్దని.. ఈ విషయాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కేంద్రంపై అనవసరంగా మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి నాడు ఇందిరాగాంధీని గెలిపిస్తే.. ఆ జిల్లా ప్రజలకు, తెలంగాణకు ఆమె ఏం చేశారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక దేశంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని కిషన్ రెడ్డి వివరించారు. తమ ఎంపీలకు మోదీ సమ ప్రాధాన్యం ఇస్తారని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత కేంద్రం తెలంగాణకు ఏం చేసిందో చెబుతామని తెలిపారు. ఈ ఎన్నికల ప్రచారానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వచ్చే అంశంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందని కిషన్ రెడ్డి తెలిపారు.

## ఔటర్ బయట వరకు హైడ్రాను విస్తరించాలి ఫోన్‌ఇన్ కార్యక్రమంలో పలువురు వినతి

ప్రభుత్వ స్థలాలు, నీటి వనరుల పరిరక్షణ కోసం హైడ్రా పరిధిని ఔటర్ రింగురోడ్డు బయట కూడా విస్తరించాలని పలువురు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరారు. హైడ్రా కార్యాలయంలో తొలిసారి నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి గంట వ్యవధిలో 36 మంది ఫోన్ చేసి భూ ఆక్రమణలు, నీటి వనరులు కలుషితమవుతున్న తీరును వివరించారు. భూ ఆక్రమణదారులను ఉపేక్షించవద్దని హైడ్రాను కోరారు. తమ ప్రాంతాల్లో ఉన్న చెరువుల్లో మురుగు చేరుతోందని, దుర్గంధభరిత వాతావరణంలో అవస్థలు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. పార్కులు, రహదారులు, ప్రభుత్వ స్థలాలు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కబ్జాకు గురి అవుతున్నాయని, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి నడక దారి లేకుండా చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. దుండిగల్ మున్సిపాలిటీలోని గాగిలాపూర్‌లో రహదారులను ఆక్రమించి ప్లాట్లు చేసి అమ్ముకుంటున్నారని తెలిపారు. ప్రగతినగర్ వద్ద ఓ పార్కులో ఆలయం నిర్మాణానికి ప్రయత్నిస్తున్నారని, నాగిరెడ్డి కుంటలోకి మురుగు చేరకుండా చేపట్టిన డైవర్షన్ కాలువ నిర్మాణ పనులు ఆగిపోయాయని, మాదాపూర్‌లోని సున్నం చెరువు వద్ద పేరుకు వంద అడుగుల రహదారి ఉన్నా.. మొత్తం నీటి ట్యాంకర్లతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని ఆయా ప్రాంతాల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన హైడ్రా కమిషనర్.. వారం వ్యవధిలో సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొదటి విడత 6 చెరువులను అభివృద్ధి చేస్తున్నామని, త్వరలోనే 14 చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు.

## రాయికల్ మున్సిపాలిటీలో అవినీతి అంతం చేయండి

### » స్టేట్ కౌన్సిల్ మెంబర్ పడాల తిరుపతి



**కరపత్రం ప్రతినిధి రాయికల్**
రాయికల్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల ర్యాలీలో పాల్గొన్న బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ పడాల తిరుపతి, మున్సిపాలిటీలో అవినీతిని అంతం చేయడానికి బీజేపీని గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## మెట్టుపల్లిలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



**గాజంగి మహేశ్వర్, కరపత్రం మెట్టుపల్లి**
మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం మెట్పల్లి పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడానికి ఈ కార్యక్రమం చేపట్టామని మెట్పల్లి డీఎస్పీ రాములు తెలిపారు. ఈ మార్చ్ లో సీఐ అనిల్ కుమార్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కరెన్సీ కాగితాలు పనికి రాకుండా పోతాయి

» **బాబా వాంగ జోస్యం**



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
బల్గేరియాకు చెందిన ప్రసిద్ధ జ్యోతిష్కురాలు బాబా వాంగ చేసిన మరో జోస్యం చర్చనీయాంశమైంది. భవిష్యత్తులో కాగితపు కరెన్సీ పనికిరాకుండా పోయి ప్రపంచం పూర్తిగా డిజిటల్ లావాదేవీల వైపు మళ్లుతుందని ఆమె అంచనా వేసింది.
ప్రస్తుతం ద్రవ్యోల్బణం, యుద్ధాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతో ఆర్థిక అనిశ్చితి పెరుగుతుండటం, జదీణజ వంటి డిజిటల్ కరెన్సీలు అమల్లోకి రావడం ఈ జోస్యానికి బలం ఇస్తున్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

## ఉడికించిన గుడ్డు .. ఆమ్లెట్

## » ఆరోగ్యానికి ఏది మంచిది



**గజెల్లి రాజేంద్రప్రసాద్, సోషల్ అనలిస్ట్**
కోడి గుడ్డు ఆరోగ్యానికి మంచిది. శాఖాహారులు కూడా గుడ్డు ఇష్టపడతారు. కొందరు ఉడికించిన కోడిగుడ్డుని ఇష్టపడితే, ఇంకొందరు ఆమ్లెట్ ఇష్టపడతారు.

**» గుడ్డులో 72 కేలరీలు, 6 గ్రాముల ప్రోటీన్, ఐదు గ్రాముల ఆరోగ్యకరమైన కొవ్వు ఉంటుంది. కండరాల పెరుగుదలకు గుడ్డు చాలా దోహదపడుతుంది**

ఉడికించిన గుడ్డు .. ఉడికించిన గుడ్డులో పోషకాలు అధికంగా ఉంటాయి. ఈ పోషకాలు మన రక్తంలోని బి12, విటమిన్ డి లను కాపాడతాయి.
ఆమ్లెట్ లో పోషకాలు ఉన్నప్పటికీ, ఆమ్లెట్ వేయడానికి నూనె కలపడం వల్ల అనారోగ్యకరమైన కొవ్వులు ఆమ్లెట్ లోకి చేరతాయి. ఈ ప్రక్రియలో పోషక విలువలు మారతాయని నిపుణులు సూచిస్తున్నారు.

### » రెండింటిలో ఏది బెస్ట్

గుడ్డులో ఆమ్లెట్ లో ఏది బెస్ట్ అని అంటే, ఉడికించిన గుడ్డే బెస్ట్ అని చెప్పవచ్చు. గుడ్డులో ప్రోటీన్లు పోషకాలు పుష్కలంగా అందుతాయి.
ఇక ఆమ్లెట్ లో పోషకాలు అధికంగా ఉన్నప్పటికీ, నూనె ఇతర పదార్థాల కూడికతో అనవసరమైన అధిక కొవ్వులు చేరతాయి. అలాగే పోషక విలువలు కూడా మారతాయి.
అన్ని వయసుల వారు ఉడికించిన కోడిగుడ్డును ప్రతిరోజు భోజనంతో కలిపి తీసుకుంటే ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని డాక్టర్లు సూచిస్తున్నారు.
వీలైతే దేశీ వాలి కోడిగుడ్లను వాడడం ఇంకా మంచిది. దేశీ కోళ్లు తగ్గిపోయిన కారణంగా పౌల్ట్రీ కోడిగుడ్లు తీసుకున్నా తగిన పోషకాలు ప్రోటీన్లు అందుతాయని నిపుణులు సూచిస్తున్నారు.

# క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి - టైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మీర్ వహాజ్ అలీ ఖాన్, మాస్టర్ రమేష్

**– రణవీర్ అండ్ శ్రేయస్ టైక్వాండో అకాడమీ విద్యార్థుల ఘనవిజయం: రాష్ట్ర స్థాయి పోటీల్లో అఖిల్‌కు స్వర్ణం, నిఖిల్‌కు కాంస్యం**



**కరపత్రం ప్రతినిధిదిన పత్రిక మల్కాజిగిరి మండల**
గచ్చిబౌలి స్టేడియం వేదికగా అత్యంత వైభవంగా జరిగిన "కుంచెట్టి ఖేల్ క్షేత్ర ఆల్ ఇండియా ఇంటర్–స్కూల్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ 2026" పోటీల్లో కౌకూరుకు చెందిన రణవీర్ అండ్ శ్రేయస్ టైక్వాండో అకాడమీ విద్యార్థులు పతకాల పంట పండించారు. మాస్టర్ రమేష్ పర్యవేక్షణలో శిక్షణ పొందిన విద్యార్థులు తమ అద్భుతమైన క్రీడా నైపుణ్యంతో అందరినీ ఆకట్టుకున్నారు.

**కాడెట్ లెవల్ క్యోరుగి విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచిన అఖిల్ బంగారు పతకం సాధించగా, అదే విభాగంలో నిఖిల్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు.**

ప్రభుత్వ సహకారం ఉంటే ఒలింపిక్స్‌కు చేరుకుంటాం: మీర్ వహాజ్ అలీ ఖాన్
ఈ సందర్భంగా టైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మీర్ వహాజ్ అలీ ఖాన్ మాట్లాడుతూ, క్రీడాకారుల ప్రతిభను కొనియాడారు. "మన రాష్ట్రంలో ప్రతిభావంతులైన క్రీడాకారులకు కొదవలేదు. ప్రభుత్వం గనుక మా అసోసియేషన్‌ను ప్రోత్సహించి, తగిన సహకారం అందిస్తే, భవిష్యత్తులో మన విద్యార్థులను ఖచ్చితంగా ఒలింపిక్స్ స్థాయికి తీసుకెళ్లడానికి మేము కృషి చేస్తాం," అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**ఆత్మవిశ్వాసానికి క్రీడలే కీలకం: మాస్టర్ రమేష్**

అకాడమీ కోచ్ మాస్టర్ రమేష్ మాట్లాడుతూ.. "విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మరక్షణ మరియు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంలో టైక్వాండో కీలక పాత్ర పోషిస్తుంది. అఖిల్, నిఖిల్ కష్టపడి ఈ పతకాలు సాధించడం గర్వంగా ఉంది," అని తెలిపారు. ఈ విజయం పట్ల క్రీడాకారుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ, తమ పిల్లలను ప్రోత్సహిస్తున్న మాస్టర్ రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ మహేశ్వర్, ట్రెజరర్ మారుతి వరప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం కృష్ణ, నరసింహ మరియు ఇతర ముఖ్య నేతలు పాల్గొని విజేతలకు సర్టిఫికెట్లు, పతకాలను అందజేశారు.

# ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే

### -సిపిఎం పార్టీ నాయకులు





**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**
సంగారెడ్డి మున్సిపాలిటీకి జరుగుతున్న ఎన్నికల్లో 16వ వార్డులో పోటీ చేస్తున్న సిపిఎం పార్టీ అభ్యర్థి సామల మురళిని గెలిపించాలని సోమవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో 16వ వార్డులో అభ్యర్థి గెరిపే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం కొనసాగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి జయరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి. సాయిలు పార్టీ నాయకులతో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను వారు కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజల కోసం నిత్యం పోరాడే కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా వార్డు సమస్యల పరిష్కారం కోసం పాలకవర్గాలపై వత్తిడి తీసుకొచ్చి పరిష్కరిస్తారన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉండి ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తిని గెలిపిస్తే వార్డు ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఎప్పుడు ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందని వారు పేర్కొన్నారు. ప్రత్యర్థి పార్టీల ప్రలోభాలకు లొంగకుండా నిబద్ధతగల సిపిఎం అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించి అహంకారులకు తగిన రీతిలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి అంటే కేవలం కాంట్రాక్టులు కాదని సామాన్యుల ముంగిట సంక్షేమ ఫలాలు చేరడమని నిత్యం ప్రజలతో మమేకమై ఉండే సిపిఎం కి ప్రజా సమస్యలపై ఎక్కువగా అవగాహన ఉంటుందని వారు అన్నారు.
సిపిఎం పార్టీ సంగారెడ్డి ఏరియా కార్యదర్శి ఎం. యాదగిరి మాట్లాడుతూ సిపిఎం పార్టీ అభ్యర్థులే కౌన్సిలర్ గా ఉండటం ద్వారా ప్రజలకు మేలు చేకూరుతుందని, ఎన్నికల సమయంలో పూటకో పార్టీ మారుతూ నిమిషానికో కండువా కప్పుకునే కంత్రిఇంటింటికిగాళ్లు మీ వద్దకు వస్తుంటారని, వాళ్ళు మాయమాటలు చెప్పి ఓట్లు దండుకొని ముఖం చాటేస్తారని అలాంటి వారి పట్ల ప్రజలంతా అప్రమంతంగా ఉండాలన్నారు. ప్రశ్నించే గొంతుక సిపిఎం అభ్యర్థిని గెలిపిస్తే నిజాయితీగా ప్రజల కోసం పని చేస్తారన్నారు. 16వ వార్డ్ ప్రజలు సామల మురళి సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు అశోక్, మహేష్, దత్తు, మల్లేశం, శ్రీను, శివ, పుండరీకం, సుభాష్, రాణి, సుధా, రాజేశ్వరి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆదరాభిమానాలు పొందుతున్న అకునూరి

**– ఇప్పటికే గెలుపు తథ్యం అంటున్న డివిజన్ ప్రజలు**
**– 8వ డివిజన్ లో దూసుకుపోతున్న ప్రచారం**
**– కమలం గుర్తుకు పెరుగుతున్న మద్దతు**
**– ప్రజాధరణకు కృతజ్ఞతలు చెబుతున్న అకునూరి తిరుమల రమేష్**





**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఫిబ్రవరి 08:**
ప్రజా ఆధరాభిమానాలకు కృతజ్ఞులమై ఉంటామని... రామగుండం నగరపాలక సంస్థ 8వ డివిజన్ లో బీజేపీ పార్టీ అభ్యర్థి అకునూరి తిరుమల రమేష్ అన్నారు. డివిజన్ లో ముమ్మర ప్రచారం చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నాటి నుండి 8వ డివిజన్లో కార్పోరేటర్ అభ్యర్థి ఉండబోతున్న విషయం తెలిసినప్పటి నుండి డివిజన్లో ప్రజలు వారి మద్దతును అకునూరి తిరుమల రమేష్ కు ఇవ్వడం పట్ల వారు ఆనందాన్ని వ్యక్తం చేశారు. వారి నమ్మకాన్ని వొమ్ము చేయకుండా డివిజన్ విస్తృతంగా ప్రచారం నిర్వహించడం జరుగుతుందన్నారు. తమ కమలం గుర్తును ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. డివిజన్లో సమస్యలు పరిష్కరించే సత్తా కేవలం అకునూరి తిరుమల రమేష్ కు ఉందని ప్రజలు నమ్ముతున్నారన్నారు. ఇప్పటికే డివిజన్లో పరిస్థితులను, సమస్యలను పూర్తిగా తెలిసిన వ్యక్తిగా ఉండడం, అంతే కాకుండా ప్రతి సమస్యపై లోతుగా సర్వే కూడా ఇప్పటికే నిర్వహించామని తెలిపారు. భావితరాల భవిష్యత్తు, యువత ఎదుర్కొంటున్న సమస్యలు, మహిళలకు ఉపాధి ఏర్పాట్లు, డివిజన్ అభివృద్ధి లాంటి అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. దానిలో భాగంగా ప్రతి కాలనీని పూర్తి తిరుగుతూ రావడం జరుగుతుందన్నారు. దీనితో పాటు ప్రజలు తమపై నమ్మకంతో వారి చూపిస్తున్న ఆధరణను మరువలేమన్నారు. కాగా, డివిజన్ అభివృద్ధి బాటలో ముందుకు పోవాలంటే ప్రతి ఒక్కడు ఒక్క తాటిపైకి వచ్చి తమ కమలం గుర్తుపై ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

# జమ్మికుంట 17వ వార్డులో కాంగ్రెస్ ప్రచారానికి ఊపిరిపోసిన ప్రజా మద్దతు

**– సుంకరి రమేష్ గెలుపే లక్ష్యంగా ఇంగిలే రామారావు ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం**



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట: ఫిబ్రవరి 8**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ పరిధిలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలు రోజురోజుకు ఉత్కంఠను రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో జమ్మికుంట మున్సిపాలిటీ 17వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, కాంగ్రెస్ పార్టీ జమ్మికుంట పట్టణ అధ్యక్షులు సుంకరి రమేష్ గెలుపును లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారాన్ని ముమ్మరం చేశారు.
ఈ ప్రచార కార్యక్రమానికి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఛైర్మెన్ ఇంగిలే రామారావు నాయకత్వం వహించడం విశేషంగా మారింది. ఆయన ఆధ్వర్యంలో 17వ వార్డు పరిధిలోని ప్రతి వీధి, ప్రతి కాలనీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాదయాత్రలు నిర్వహిస్తూ ఇంటింటి ప్రచారం చేపట్టారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకుని, కాంగ్రెస్ పార్టీ పరిష్కారాలను వివరించారు.
ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుంకరి రమేష్ మాట్లాడుతూ, జమ్మికుంట పట్టణం సమగ్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన విధానంతో ముందుకు సాగుతోందని తెలిపారు. గతంలో కాంగ్రెస్ పార్టీ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో తీసుకువచ్చిన మార్పులను గుర్తుచేశారు. ముఖ్యంగా పేదలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా దేవస్థానం ఛైర్మెన్ ఇంగిలే రామారావు మాట్లాడుతూ,
"ప్రజల సంక్షేమం, పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం. 17వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే సామర్థ్యం సుంకరి రమేష్‌కు ఉంది. ప్రజలు మరోసారి కాంగ్రెస్ పార్టీకి అవకాశమివ్వాలి" అని పిలుపునిచ్చారు.
అలాగే, తాగునీటి సమస్య, డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల నిర్మాణం, పారిశుద్ధ్యం, వీధి దీపాల ఏర్పాటు, పేదల కోసం సంక్షేమ పథకాలు వంటి అంశాలను ప్రథమ ప్రాధాన్యంగా తీసుకుని పనిచేస్తామని కాంగ్రెస్ నాయకులు ప్రజలకు భరోసా ఇచ్చారు. వార్డులో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయడం తమ లక్ష్యమని పేర్కొన్నారు.
ప్రచార సమయంలో ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. అనేక మంది స్థానికులు కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలపై తమ మద్దతును ప్రకటిస్తూ, ఈసారి సుంకరి రమేష్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా మహిళలు, యువత, వృద్ధులు కాంగ్రెస్ పార్టీ ప్రచారానికి పెద్ద ఎత్తున మద్దతుగా నిలిచారు.
ఈ విస్తృత ప్రచార కార్యక్రమంలో శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పట్టణ మరియు వార్డు స్థాయి నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం సభ్యులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
మొత్తంగా జమ్మికుంట మున్సిపాలిటీ 17వ వార్డులో కాంగ్రెస్ పార్టీ ప్రచారం రోజురోజుకు మరింత ఊపందుకుంటూ, ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుకుంటూ ముందుకు సాగుతోంది. సుంకరి రమేష్ గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా పనిచేస్తూ, ఎన్నికల బరిలో గట్టి పోటీని ఇస్తున్నాయి.

కరపత్రం తెలుగు దిన పత్రిక
సోమవారం ఫిబ్రవరి 9, 2026

# ప్రచారంలో గెలుపే లక్ష్యంగా దూసుకుపోతున్న 7వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి పొనగంటి మధు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట :ఫిబ్రవరి 8**



జమ్మికుంట మున్సిపాలిటీ ఎన్నికల సమరం రోజురోజుకూ ఉత్కంఠభరితంగా మారుతున్న వేళ, 7వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన పొనగంటి మధు తన ప్రచారాన్ని మరింత ఉధృతం చేస్తూ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఉదయం తొలిప్రభాతంలో మొదలయ్యే ప్రచారం రాత్రి వరకు నిరంతరంగా కొనసాగుతుండటం ఆయన కట్టుబాటు, పట్టుదలకు నిదర్శనంగా నిలుస్తోంది.

ఇంటింటి ప్రచారం, వీధివీధి సమావేశాలు, చిన్నచిన్న గల్లీల్లో జనంతో నేరుగా మమేకమవుతూ ప్రజల హృదయాలను గెలుచుకుంటున్నారు. ప్రతి ఇంటి వద్ద ఆగి వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఓపికగా వింటూ, అవి తన బాధ్యతగా భావించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని భరోసా ఇస్తున్నారు. మాటలకే పరిమితం కాకుండా, కార్యాచరణతో అభివృద్ధి సాధిస్తాననే ధీమా ఆయన ప్రచారంలో స్పష్టంగా కనిపిస్తోంది.

7వ వార్డులోని తాగునీటి సమస్య, డ్రైనేజీ వ్యవస్థ లోపాలు, అంతర్గత రోడ్ల దుస్థితి, వీధిదీపాల కొరత, పారిశుధ్య సమస్యలు, బతుకమ్మ ఆట స్థలానికి సరైన మౌలిక వసతులు, పేదల గృహ సమస్యలు వంటి అనేక అంశాలపై సమగ్ర ప్రణాళికను ప్రజల ముందు ఉంచుతూ విశ్వాసం కలిగిస్తున్నారు. ముఖ్యంగా శుభ్రమైన తాగునీరు, మెరుగైన పారిశుధ్యం, సురక్షితమైన రోడ్లు ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇస్తున్నారు.

ప్రచారంలో భాగంగా యువత, మహిళలు, వృద్ధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ వార్డు అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములుగా చేసుకుంటానని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు, మహిళల భద్రతకు ప్రాధాన్యం, పిల్లలకు మెరుగైన వాతావరణం, పచ్చదనం పెంపు వంటి అంశాలపై స్పష్టమైన ఆలోచనలతో ముందుకు వెళ్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించి, అవి జమ్మికుంట పట్టణానికి మరింత మేలు చేస్తాయని ప్రజలకు తెలియజేస్తున్నారు. పొనగంటి మధు ప్రచారానికి 7వ వార్డు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. యువకులు, మహిళలు, వృద్ధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రచారంలో పాల్గొనడం, ఇంటింటా కాంగ్రెస్ జెండాలు ఎగరవేయడం ద్వారా తమ మద్దతును స్పష్టంగా ప్రకటిస్తున్నారు.

మధు యొక్క అందుబాటు స్వభావం, నిరాడంబరత, సేవాభావం ప్రజలను ఆకర్షిస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా పొనగంటి మధు మాట్లాడుతూ, "7వ వార్డు అభివృద్ధే నా ఏకైక లక్ష్యం. మాటలు కాదు -- పనులే నా గుర్తింపు. ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. ప్రతి సమస్యకు పరిష్కారం చూపే బాధ్యతాయుతమైన కౌన్సిలర్‌గా నిలుస్తాను" అని ధీమా వ్యక్తం చేశారు. మొత్తానికి జమ్మికుంట మున్సిపాలిటీ ఎన్నికల్లో 7వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి పొనగంటి మధు ప్రచారం రోజురోజుకు ఊపందుకుంటూ, ప్రజల మద్దతుతో ముందుకు సాగుతూ ప్రత్యర్థులకు గట్టి సవాల్ విసురుతున్నారు. గెలుపే లక్ష్యంగా సాగుతున్న ఆయన ప్రచారం వార్డులో రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తోంది.

# సీఎం కప్‌లో జమ్మికుంట గర్ల్స్--1 క్రీడా సత్తా

**- ఖో--ఖోలో ప్రథమ బహుమతి... కబడ్డీలో ద్వితీయ స్థానం**
**- ఇద్దరు విద్యార్థినులు జిల్లా స్థాయి కబడ్డీకి ఎంపిక**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఫిబ్రవరి 8**




హుజూరాబాద్ నియోజకవర్గం చెల్పూర్‌లో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో జమ్మికుంట పట్టణానికి చెందిన జమ్మికుంట గర్ల్స్--1 ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు అద్భుత ప్రతిభ ప్రదర్శించి ఘన విజయం సాధించారు. అంతర్ పాఠశాల స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో ఖో--ఖో విభాగంలో ప్రథమ బహుమతి, కబడ్డీ విభాగంలో ద్వితీయ బహుమతి సాధించి పాఠశాలకు క్రీడా రంగంలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు.

ప్రతిభకు పట్టం కడుతూ నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో వివిధ మండలాల నుంచి వచ్చిన పాఠశాలలతో తీవ్ర పోటీని ఎదుర్కొన్నప్పటికీ, జమ్మికుంట గర్ల్స్--1 విద్యార్థినులు సమిష్టి కృషితో విజయం సాధించడం విశేషంగా నిలిచింది. ముఖ్యంగా ఖో--ఖో పోటీల్లో ప్రత్యర్థి జట్లను చాకచక్యంగా ఓడిస్తూ మొదటి స్థానం దక్కించుకున్నారు. అదే విధంగా కబడ్డీ పోటీల్లో చివరి వరకు పోరాడి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు.

ఇంకా కబడ్డీ విభాగంలో అత్యుత్తమ ఆటతీరుతో ఆకట్టుకున్న ఇద్దరు విద్యార్థినులు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు మరింత గర్వకారణంగా మారింది. ఇది పాఠశాలలో అందిస్తున్న క్రమబద్ధమైన క్రీడా శిక్షణకు నిదర్శనంగా పలువురు ప్రశంసలు కురిపించారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, క్రీడా ఉపాధ్యాయులు విద్యార్థినులను అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థినులు కూడా క్రీడల్లో సత్తా చాటగలరని ఈ విజయం నిరూపించిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

జమ్మికుంట గర్ల్స్--1 విద్యార్థినుల ఈ విజయం పాఠశాలకే కాకుండా జమ్మికుంట పట్టణానికి క్రీడా రంగంలో మరింత గుర్తింపు తీసుకువచ్చిందని స్థానికులు అభినందనలు తెలియజేశారు

# కరాటే సమాజంలో ప్రతి ఒక్కరికి ఆత్మరక్షణ

**- తెలంగాణ ఫిలిం ఛాంబర్ చైర్మన్ రామకృష్ణ గౌడ్**

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**



సమాజంలో ప్రతి ఒక్కరికీ కరాటే ఆత్మ రక్షణగా నిలుస్తుందని తెలంగాణ ఫిలిం ఛాంబర్ చైర్మన్ రామకృష్ణ గౌడ్ అన్నారు. ఆదివారం ఓకినావ స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో, వేములవాడ బీసీ సాధికారిత సంఘం సహకారంతో వేములవాడ బైపాస్ రోడ్డులోని శ్రీనివాస కళ్యాణ మండపంలో ఉత్తర తెలంగాణ జిల్లాల ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్--2026 పోటీలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ చైర్మన్ డాక్టర్ ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, కరాటే విద్య శత్రువుల నుంచి మాత్రమే కాకుండా అనుకోని ప్రమాదాల నుండి కూడా రక్షిస్తుందని, ఇది యువతలో సాహసాన్ని పెంచి జీవిత సవాళ్లను ఎదుర్కొనే శక్తిని అందిస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు పటేల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, బీసీ సాధికారత సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ మాట్లాడుతూ, కరాటే విద్య విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను చిన్న వయసులోనే మార్షల్ ఆర్ట్స్ వైపు ప్రోత్సహించాలని సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో లక్ష మందికి కరాటే శిక్షణ ఇవ్వడమే ఈ సంస్థ లక్ష్యమని తెలిపారు. కరాటే మాస్టర్స్ సంపత్ కుమార్, వసంత్ కుమార్, మొండయ్య, శ్రీనివాస్ మాట్లాడుతూ, కరాటే సాధన ద్వారా శరీరం చురుకుదనం పొందడంతో పాటు ప్రమాద సమయంలో తక్షణ స్పందన సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ పెంపొందించడంలో కరాటే కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఓకినవ స్పోర్ట్స్ కరాటే అకాడమీ చీఫ్ ఆర్గనైజర్ ఎంఏ మన్నన్ మాట్లాడుతూ, సంస్థ స్థాపించి 35 సంవత్సరాలు పూర్తయ్యాయని, ఇప్పటివరకు సుమారు 35 వేల మందికి శిక్షణ అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న, జలీల్, లింగయ్య, రమేష్, పెద్ద ఎత్తున పిల్లలు వారి తల్లి తండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# తూప్రాన్ మున్సిపాలిటీ ఎన్నికల్లో ఒకటో వార్డు నుండి బొంది రజిని రవీందర్ గౌడ్, 12వ వార్డు నుండి బొంది అరుణ వెంకట్ గౌడ్ గెలుపు బాటలో దూసుకుపోతున్న తోడికోడళ్ళు

**కరపత్రం ప్రతినిధివెల్దుర్తి మాసాయిపేట ఫిబ్రవరి 8**




మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ ఎన్నికల్లో విజయం దిశగా దూసుకుపోతున్న తోడికోడళ్ళు రజిని రవీందర్ గౌడ్, అరుణ వెంకట్ గౌడ్, పోయిన ఎన్నికల్లో మొదటిసారిగా తూప్రాన్ పట్టణం మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత మొట్టమొదటి మున్సిపల్ చైర్మన్గా బి ఆర్ ఎస్ నుండి బొంది రవీందర్ గౌడ్ సమర్థవంతంగాబాధ్యతలు నిర్వహించారు, తన్నీరు హరీష్ రావుకి అత్యంత సన్నిహితుడుగా రవీందర్ గౌడ్దపేరుసంపాదించుకున్నారు, ప్రజాసేవలో రజిని రవీందర్ గౌడ్, అరుణ వెంకట్ గౌడ్ లు మాట్లాడుతూ సేవకురాలిగా పనిచేస్తామని తూప్రాన్ పట్టణంలోని మౌలిక వసతులు, డ్రైనేజీ వ్యవస్థ, పచ్చదనం పరిశుభ్రత, మంచినీటి వసతి, వీధి దీపాల ఏర్పాటు, డబుల్ బెడ్రూం రాణి నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ లు, పెన్షన్లు వచ్చేటట్టు సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణం అందేలా చర్యలు చేపడతామని, కెసిఆర్ హయంలో రైతుబంధు, కళ్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్, పెన్షన్ 200 నుండి 2000 చేసిన ఘనత తెలంగాణ జాతిపిత కెసిఆర్ దే నని వారు తెలియజేశారు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత బస్సు అని మహిళలను రోడ్డుకు లాగారని, మహాలక్ష్మి పథకం కింద 2500 ప్రకటించి మహిళలను ప్రలోభ పెట్టారని, రైతుబంధు నగదు పత్తా లేదని వారు తెలియజేశారు 11 వ తారీకు బుధవారం జరిగే ఎన్నికల్లో ఒకటో వార్డ్, 12వ వార్డు నుండి మీ అమూల్యమైన ఓటు కారు గుర్తుకు వేసి మమ్మల్ని ఆశీర్వదించాలని ప్రజలను వేడుకున్నారు.

# ప్రజా సేవే లక్ష్యం... సమ్రిన్ గఫర్ వైపు ఓటర్ల మొగ్గు..

**- బిఆర్ఎస్ అభివృద్ధి మంత్రంతో ఓటర్ల మనసు గెలుచుకుంటున్న సమ్రిన్...**

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్:**



2వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సమ్రిన్ గఫర్ గెలుపు బాటలో దూసుకెళ్తున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కొన్నేళ్లుగా అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ప్రభావం ఈ ఎన్నికల్లో స్పష్టంగా కనిపిస్తున్నది. వార్డులో మౌలిక వసతుల అభివృద్ధి, రహదారుల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, వీధి దీపాల ఏర్పాటు వంటి పనులు ప్రజల్లో సానుకూల వాతావరణాన్ని తీసుకొచ్చాయి.

ప్రత్యేకంగా పేద కుటుంబాలకు అందిన ఆర్థిక సహాయం, మహిళా సంక్షేమ పథకాలు, వృద్ధాప్య పింఛన్లు, విద్యార్థులకు అందిన సదుపాయాలు ఓటర్లను ఆకట్టుకుంటున్నాయి. "అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ బిఆర్ఎస్‌కే ఓటు వేయాలి" అనే అభిప్రాయం ఓటర్లలో వ్యక్తమవుతోంది.

సమ్రిన్ గఫర్ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారం దిశగా హామీలు ఇస్తున్నారు. స్థానిక యువత, మహిళలు, వృద్ధులు పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొంటుండటం గెలుపు సంకేతంగా పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. వార్డు అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని, ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా సేవలందిస్తానని సమ్రిన్ గఫర్ హామీ ఇస్తున్నారు. దీంతో 2వ వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థి వైపే ఓటర్ల మొగ్గు స్పష్టంగా కనిపిస్తున్నదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# నర్సాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం మద్దతుగా ప్రచారాన్ని నిర్వహించిన

**- మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి**

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఫిబ్రవరి 8**



మెదక్ జిల్లానర్సాపూర్ మున్సిపాలిటీ ఎన్నికలలో ఉత్సాహంగా ఇంటింటి ప్రచారంకాంగ్రెస్ విజయానికి ప్రజల మద్దతు అవసరమని.

మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ అజ్మత్ అలీ గారికి మద్దతుగా విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించడం జరిగింది. అలాగే శివంపేట్ మండల్ పోతులగూడ గ్రామానికి చెందిన రాజశేఖర్ గౌడ్ భార్య నిర్మల గత కొన్ని రోజుల క్రితం మరణించడం జరిగింది.వారి యొక్క దిశ దినకర్మ కార్యక్రమానికి హాజరై ఆ కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది.. ఈ కార్యక్రమం లో గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ చిలుముల సుహాసిని రెడ్డి మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు ప్రముఖ సంఘ సేవకులు బీసీ నాయకులు బండారి గంగాధర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పెద్దలు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి

**- బిఆర్ఎస్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎడవెల్లి కొండాల్ రెడ్డి**

**కరపత్రం ప్రతినిధి హుజరాబాద్:**



హుజూరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థులను ఆదరించి ఆశీర్వదించి గెలిపించాలని బిఆర్ఎస్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎడవెల్లి కొండారెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం హుజూరాబాద్ పట్టణంలోని పలు వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ విస్తృత ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. బిఆర్ఎస్ చేసిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హాయంలోనే హుజురాబాద్ ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిన హుజురాబాద్ కు చేసింది శూన్యం అన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల్లో ఏ ఒక్క పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలే తమ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. పట్టణ ప్రజలు ఆలోచించి బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, హుజరాబాద్ పట్టణ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# అభివృద్ధికి పట్టం కట్టండి

**- బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి**
**- బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మంద రమేష్ (ఆర్కే)**
**- 21 వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థి గోవర్ధన్ ను గెలిపించాలని ప్రచారం**

**కరపత్రం ప్రతినిధి హుజరాబాద్:**



ఈ మున్సిపల్ ఎన్నికల్లో అభివృద్ధికి పట్టం కట్టి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని మున్సిపల్ మాజీ చైర్మన్ బిఆర్ఎస్ నాయకులు మంద ఉమాదేవి-రమేష్ (ఆర్కే) ఆరోపించారు. ఆదివారం హుజూరాబాద్ పట్టణంలోని 21 వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థి గోవర్ధన్ ను గెలిపించాలని కోరుతూ విస్తృత ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. బిఆర్ఎస్ చేసిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బిఆర్ఎస్ ప్రభుత్వం హాయంలోనే హుజురాబాద్ ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిన హుజురాబాద్ కు చేసింది శూన్యం అన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల్లో ఏ ఒక్క పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలే తమ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయని, హుజురాబాద్ మున్సిపల్ పై బిఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. హుజూరాబాద్ పట్టణ ప్రజలు ఆలోచించి బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.